# ప్రజా మారీటవం

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 189 పేజీలు : 04 వెల రూ. 2 మంగళవారం 13 - 01 - 2026




హైదరాబాద్‌లో రోజువారి ప్లాస్టిక్ చెత్త 570 కిలోలు

# ప్రభుత్వ ఉద్యోగులకు సీఎం సంక్రాంతి కానుక

- ఉద్యోగులే తమ సారథులు, వారధులు సీఎం రేవంత్‌రెడ్డి
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 3.64 శాతం డీఏ పెంచుతూ ఉత్తర్వులు
- ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్య
- ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా
- ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12 వేల కోట్ల మేర పెండింగ్ ఉన్నాయన్న సీఎం రేవంత్ రెడ్డి
- రాష్ట్రంలో త్వరలో జిల్లాల పునర్విభజన
- రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ప్రత్యేక కమిటీ వేస్తామన్న సీఎం రేవంత్
- కొత్త జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని సీఎం స్పష్టం



హైదరాబాద్ : ఉద్యోగులే తమ సారథులు, వారధులు అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, గత ప్రభుత్వం వదిలివెళ్లిన అప్పులు తీర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరన్న ముఖ్యమంత్రి, రాష్ట్రాన్ని నడిపేది 10.50 లక్షల మంది ఉద్యోగులని, ఉద్యోగులు సరిగా పని చేయడం వల్లే పథకాలు సరిగా అమలు అవుతున్నాయని కితాబిచ్చారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12 వేల కోట్ల మేర పెండింగ్ ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పన్ను వసూళ్లలో అవకతవకలు అరికడితే కావాల్సిన నిధులు అవే వస్తాయన్నారు. పన్నులు పెంచాల్సిన అవసరం లేదని, సరిగా వసూళ్లు చేస్తే చాలన్న సీఎం, చాలా మందిని పన్ను కట్టాలని ఉద్యోగులు అడగట్లేదన్నారు. ఈ క్రమంలోనే ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఈ - మిగతా 2 లో

## పోలవరం నల్లమల సాగర్ వివాదం



- సుప్రీంకోర్టులో పిటిషన్ ఉపసంహరించుకున్న తెలంగాణ
- పిటిషన్ డిస్పోజ్ ఆఫ్ చేసినట్లుగా ప్రకటించిన సీజేఐ
- రిట్ పిటిషన్ వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదన్న సీజేఐ
- సూట్ దాఖలు చేస్తే అన్ని పరీవాహక రాష్ట్రాల అభిప్రాయాలు పరిగణనలోకి వస్తాయన్న ధర్మాసనం

హైదరాబాద్ : సుప్రీంకోర్టులో పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుపై దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దీంతో పిటిషన్ డిస్పోజ్ ఆఫ్ చేసినట్లుగా ప్రధాన న్యాయమూర్తి ప్రకటించారు. అంతకుముందు నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో విచారణ ప్రారంభం కాగా, తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. తెలంగాణ దాఖలు చేసిన రిట్ పిటిషన్ వల్ల ఎలాంటి - మిగతా 2 లో



2 లో

## ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఇప్పటి వరకు తాను ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదన్న ముఖ్యమంత్రి

ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరన్న రేవంత్ రెడ్డి

ఉద్యోగులే ప్రభుత్వ సారథులు.. వారధులన్న ముఖ్యమంత్రి

## సిద్ధమైన ప్రధాని మోదీ కొత్త కార్యాలయం

- కొత్త కార్యాలయానికి ప్రధాని మోదీ
- మారనున్న పీఎంవో చిరునామా
- రాయ్‌సీనా హిల్స్ వద్ద సిద్ధమైన ప్రధాని కొత్త కార్యాలయం
- 'సేవా తీర్థ్'గా నామకరణం చేసిన కేంద్ర ప్రభుత్వం
- ఈ నెల 14 తర్వాత పీఎంవో తరలింపు ఉంటుందని అంచనా
- స్వాతంత్ర్యం తర్వాత తొలిసారి సౌత్ బ్లాక్ నుంచి మారనున్న పీఎంవో



ఢిల్లీ : భారత ప్రధాని కార్యాలయం (పీఎంవో) చిరునామా త్వరలో మారనుంది. సెంట్రల్ విస్టా రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అత్యాధునిక కార్యాలయ భవన సముదాయంలోకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెలలోనే మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. జనవరి 14 తర్వాత, మకర సంక్రాంతి అనంతరం ఆయన కొత్త కార్యాలయంలోకి ప్రవేశించవచ్చని ప్రభుత్వ వర్గాల సమాచారం మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఢిల్లీలోని సౌత్ బ్లాక్ నుంచే పీఎంవో కార్యకలాపాలు సాగుతుండగా, 78 ఏళ్ల తర్వాత తొలిసారి ఈ కార్యాలయం వేరే చోటుకు మారుతుండటం చారిత్రక ప్రాధాన్యం సంతరించుకుంది.రాయ్‌సీనా హిల్స్‌కు సమీపంలో, దారా షికో రోడ్డులో నిర్మించిన ఈ కొత్త భవన సముదాయానికి 'సేవా తీర్థ్' అని ప్రభుత్వం నామకరణం చేసింది. ఇందులో మొత్తం మూడు - మిగతా 2 లో

## ఇస్రో రాకెట్ ప్రయోగం విఫలం

- సమస్యను విశ్లేషిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు
- నిర్దిష్ట సమయానికి నింగికెగిరిన పీఎస్ఎల్వీ సీ62
- రెండు దశల పాటు సాఫీగా సాగిన రాకెట్ ప్రయాణం
- 'అన్వేష' ఉపగ్రహంతో పాటు భారత్, యూకే, థాయ్‌లాండ్, బ్రెజిల్, స్పెయిన్, నేపాల్ తదితర దేశాలకు చెందిన మరో 14 చిన్న ఉపగ్రహాలను కూడా ఈ రాకెట్ మోసుకెళ్లింది




2 లో

## వాహనాల చలాన్లకు డిస్కౌంట్ ఇవ్వొద్దు

- ఖాతా నుంచి వెంటనే డబ్బులు కట్ కావాలి
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- వాహనాలకు చలాన్లు విధిస్తున్నప్పటికీ డిస్కౌంట్ ఇస్తారనే ఆలోచన ఉందని వ్యాఖ్య
- వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలోనే బ్యాంకు ఖాతాను లింక్ చేయాలని సూచన
- మైనర్లకు ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులపై కేసు పెట్టాలన్న ముఖ్యమంత్రి




2 లో




## దక్షిణ భారత్‌లో ఏ రాష్ట్రమూ మనతో పోటీపడలేదు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- పోలవరం పూర్తయితే దక్షిణ భారత్‌లో ఏ రాష్ట్రమూ మనతో పోటీపడలేదు
- మంత్రులు, కార్యదర్శులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- జీఎస్డీపీ, ఆర్టీజీఎస్, పట్టాదారు పాస్ పుస్తకాలు తదితర అంశాలపై ప్రధానంగా చర్చ, సూపర్ సిక్స్ ద్వారా సంక్షేమం, అభివృద్ధిని వేగంగా చేయగలిగామని ఉద్ఘాటన
- విధ్వంసమైన వ్యవస్థల నుంచి సుపరిపాలనను గాడిలో పెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం
- సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం




అమరావతి : విధ్వంసమైన వ్యవస్థల నుంచి సుపరిపాలనను గాడిలో పెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. జీఎస్డీపీ, ఆర్టీజీఎస్, పట్టాదారు పాస్ పుస్తకాలు తదితర అంశాలపై ప్రధానంగా చంద్రబాబు సమీక్షించారు. ఈ అంశాలపై మంత్రులు, కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు.2025 ఏడాది మంచి ఫలితాలను ఇచ్చిందని, ప్రజల ఆశల్ని నిలబెట్టామనీ, వారిలో విశ్వాసాన్ని మళ్లీ కల్పించామని ఆయన పేర్కొన్నారు. అప్పు తీసుకునే వెసులుబాటు కూడా లేని పరిస్థితి నుంచి సూపర్ సిక్స్ ద్వారా సంక్షేమం, అభివృద్ధిని వేగంగా చేయగలిగామని చంద్రబాబు ఉద్ఘాటించారు. ఈ ఏడాది కూడా మరింత కష్టించి పని చేద్దామని మంత్రులకు పిలుపునిచ్చారు.స్త్రీశక్తి ద్వారా 3.5 కోట్ల ప్రయాణాలు: తల్లికి వందనం ద్వారా రూ.10,090 కోట్లను 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేశామని చంద్రబాబు వెల్లడించారు. అదే విధంగా స్త్రీశక్తి ద్వారా 3.5 కోట్ల - మిగతా 2 లో

## మూడు రోజుల పాటు జరిగిన పీఠికాపుర సంక్రాంతి మహోత్సవం



- పిఠాపురం సంక్రాంతి వేడుకలను కొనియాడుతూ పవన్ కల్యాణ్ స్పందన
- అద్భుతంగా జరిగిన పీఠికాపుర సంక్రాంతి మహోత్సవం
- మూడు రోజు పాటు జరిగిన వేడుకలు
- సంతోషాన్ని వ్యక్తం చేసిన పవన్ కల్యాణ్

అమరావతి : సంక్రాంతి పండుగ సందర్భంగా పిఠాపురంలో మూడు రోజుల పాటు జరిగిన పీఠికాపుర సంక్రాంతి మహోత్సవం అద్భుతంగా సాగిందని, ఈ కార్యక్రమం విజయవంతమైందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ వేడుకలకు పూర్తి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు."మొదటి రోజు సాంప్రదాయ కళలతో సందడి చేశారు. సత్యసాయి జిల్లా ఉరుముల కళారూపంతో - మిగతా 2 లో

# సంపాదకీయం

## హైదరాబాద్‌కు ఇండోర్ హెచ్చరిక!



భారతదేశ పటంలో 'పరిశుభ్రత' అనే పదానికి పర్యాయపదంగా మారిన నగరం ఇండోర్. వరుసగా ఏడుసార్లు 'దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరం'గా ఎంపికై, అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఆ నగరంలో కలుషిత నీరు తాగి పలువురు ప్రాణాలు కోల్పోవడం, వందలాది మంది ఆసుపత్రుల పాలు కావడం యావత్ దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. స్వచ్ఛతలో శిఖరాగ్రాన ఉన్న నగరానికే ఈ పరిస్థితి దాపురిస్తే, హైదరాబాద్ వంటి నగరాల పరిస్థితి ఏమిటి? ఇండోర్ ప్రపంచ స్థాయి నగరంగా ఎదగడానికి పునాది వేసిన దార్శనికుడు మన తెలంగాణ బిడ్డ, నాటి ఇండోర్ కలెక్టర్ పరికిపండ్ల నరహరి. ఇండోర్‌లో 'డస్ట్‌బిన్ ఫ్రీ సిటీ' విధానాన్ని తెచ్చి, చెత్తను ఇంటి నుంచే సేకరించే పద్ధతిని విప్లవాత్మకంగా అమలు చేశారు. ఒక తెలుగు అధికారి వేసిన ఆ పటిష్ఠమైన పునాది వల్లే ఇండోర్ 'స్వచ్ఛత సౌధం' నిర్మితమైంది. కానీ దురదృష్టవశాత్తు, ఆ పునాదులపై భవంతిని నిర్మించాల్సిన తర్వాతి పాలకులు, నిర్వహణలో అలసత్వం వహించారు. పైకి కనిపించే అందం (రోడ్ల పరిశుభ్రత) మీద పెట్టిన దృష్టి, భూగర్భంలో దాగి ఉన్న ప్రమాదం (నీటి పైపుల నిర్వహణ) మీద పెట్టకపోవడమే నేటి విషాదానికి కారణమైంది.పాత నగరాల్లో తాగునీటి పైపులైన్లు, డ్రైనేజీ లైన్లు పక్కపక్కనే వెళుతుంటాయి. దశాబ్దాల క్రితం వేసిన ఈ పైపులు తుప్పు పట్టి, చిన్న రంధ్రాలు పడతాయి. మన దేశంలో 24 గంటల నీటి సరఫరా లేకపోవడం వల్ల, నీళ్లు ఆగిపోయినప్పుడు ఖాళీ పైపుల్లో 'నెగెటివ్ ప్రెజర్' (వాక్యూమ్) ఏర్పడుతుంది. ఆ సమయంలో పక్కనే ఉన్న డ్రైనేజీ లైన్ లీక్ అవుతుంటే, ఆ మురుగు నీటిని మంచినీటి పైపు బలంగా లోపలికి పీల్చుకుంటుంది. ఇండోర్‌లో జరిగింది ఇదే.హైదరాబాద్ పరిస్థితి ఇండోర్ కంటే భిన్నంగా ఏమీ లేదు. మన పాతబస్తీతో పాటు, సికింద్రాబాద్, అబిడ్స్, కోఠి వంటి ప్రాంతాల్లో ఇప్పటికీ నిజాం కాలం నాటి డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థలే ఉన్నాయి. అవి కాలం చెల్లినవి. మరోవైపు నగరంలో చాలా చోట్ల పాత సిమెంట్ (ఆస్బెస్టాస్) పైపులే వాడుతున్నారు. వీటికి తోడు, నగరంలో చాలామంది నీళ్లు రావడం లేదని నేరుగా మునిసిపల్ పైపులైన్‌కే మోటార్లు బిగిస్తున్నారు. దీనివల్ల పైపుల్లో కృత్రిమంగా పీడనం తగ్గిపోయి, చుట్టుపక్కల ఉన్న మురుగు నీరు లోపలికి వచ్చే ప్రమాదం మరింత పెరుగుతుంది.తెలంగాణ ప్రస్తుత ప్రభుత్వం 'మూసీ ప్రక్షాళన'ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇది మంచి పరిణామమే. నదిని శుభ్రం చేయడంతో పాటు నగర ప్రజల గొంతు దిగే గుక్కెడు నీళ్లు కూడా శుభ్రంగా ఉండేలా చూడటం కూడా అంతే ముఖ్యం. 'స్వచ్ఛత' అంటే కంటికి కనిపించే అందం మాత్రమే కాదు, కడుపులో చేరే ఆరోగ్యం కూడా. ఇప్పటికైనా పాలకులు రోడ్ల మీద తనిఖీలు తగ్గించి, భూగర్భంలో ఉన్న పైపులైన్ల పరిస్థితిపై 'రోబోటిక్ ఆడిట్' నిర్వహించాలి. పాత పైపులను యుద్ధ ప్రాతిపదికన మార్చాలి. అవార్డులు కేవలం అలంకారాలే కానీ, అవి ప్రాణాలకు రక్షణ కవచాలు కావు. లేదంటే, ఇండోర్ అనుభవం రేపు మన ఇంటి తలుపు తట్టవచ్చు.

# దక్షిణ భారత్‌లో ఏ రాష్ట్రమూ మనతో పోటీపడలేదు

**మొదటిపేజీ తరువాయి** – ప్రయాణాలు మహిళలు చేశారన్న చంద్రబాబు, దీనికోసం ఇప్పటి వరకూ రూ.11,014 కోట్లు వ్యయం చేశామని సీఎం గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవ ద్వారా 46 లక్షల మంది రైతులకు రూ.6,310 కోట్లు జమ చేశామని తెలిపారు.దీపం 2.0 ద్వారా 2 కోట్ల సిలిండర్లను ఇప్పటికి పంపిణీ చేయగలిగామనీ, అందుకుగాను రూ.2,684 కోట్లు వ్యయం చేశామని సీఎం చంద్రబాబు వివరించారు. ఏడాదిన్నరలో రూ.50,000 కోట్ల మేర సామాజిక పెన్షన్లను అందించటంలో సంక్షేమంలో సరికొత్త మైలురాయిని సాధించామని తేల్చి చెప్పారు. దాదాపు 70 వరకూ పెద్ద పథకాలు, కార్యక్రమాలు, పనులు చేశామని చంద్రబాబు తెలిపారు. అమరావతిని శ్మశానం, ఎడారని ఎగతాళి చేశారనీ, కానీ ఇదో స్ఫూర్తిదాయక ప్రాజెక్టు అని స్పష్టం చేశారు. అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. పోలవరం అత్యద్భుత ప్రాజెక్టు: పోలవరం అత్యద్భుతమైన ప్రాజెక్టనీ, ఈ ప్రాజెక్టు పూర్తి అయితే దక్షిణ భారత్‌లో ఏ రాష్ట్రమూ మనతో పోటీ పడలేదని చంద్రబాబు గుర్తు చేశారు. ప్రతీ ఏటా 3,000 టీఎంసీల మేర నీరు వృధాగా సముద్రంలోకి వెళ్తోందన్న సీఎం, పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు ఇవ్వటం ద్వారా శ్రీశైలంలోని నీటిని పొదుపు చేసి రాయలసీమకు ఇస్తున్నట్లు వివరించారు. నల్లమల సాగర్ ద్వారా రాయలసీమ, ప్రకాశం తదితర ప్రాంతాలకు నీరు ఇచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎవరికీ నష్టం లేదని తేల్చిచెప్పారు.పుష్కరాల్లోగా పోలవరం నిర్మాణం!: ఎగువ నుంచి వదిలిన నీళ్లు పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు తీసుకెళ్లి వాడుకుంటే తప్పేంటని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. పోలవరంలో మిగిలిన నీళ్లు తెలంగాణా రాష్ట్రం సైతం వినియోగించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. తెలంగాణ ప్రాజెక్టులు కట్టినప్పుడు తానెప్పుడూ అడ్డు చెప్పలేదని స్పష్టం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలూ గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవచ్చుననే అభిప్రాయాన్ని సీఎం చంద్రబాబు వ్యక్తం చేశారు. పుష్కరాల్లోగా పోలవరం ప్రాజెక్టును నిర్మించి జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు వెల్లడించారు.భోగాపురం ఎయిర్ పోర్టు కూడా త్వరలోనే జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర సహకారంతో రూ.12,000 కోట్ల సాయంతో దానిని కాపాడుకున్నామని చెప్పారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల సెంటిమెంట్ ఆ ప్లాంట్‌ను నిలబెట్టి తీరుతామని తేగ్గేసి చెప్పారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు ఏపీకే వచ్చాయని వివరించారు. పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ మారిందని చంద్రబాబు అన్నారు. సీఐఐ ద్వారా చేసుకున్న ఒప్పందాలు అన్నీ సాకారం అయితే 16 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని వివరించారు.ఎస్ఐపీబీ ద్వారా 8.74 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం కూడా ఇచ్చామనీ, వీటి ద్వారా కూడా పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయని చంద్రబాబు తెలిపారు. గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఏఐ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావటంలో కృషి చేసిన అధికారులు, ప్రభుత్వ విభాగాలను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అభినందించారు.ఆరు నెలల్లో క్వాంటం కంప్యూటర్: అమరావతిలో క్వాంటం వ్యాలీకి త్వరలో ఫౌండేషన్ వేస్తామనీ, ఆరు నెలల్లో క్వాంటం కంప్యూటర్ ఇక్కడి నుంచి పనిచేస్తుందని తేల్చి చెప్పారు. విద్యుత్ కొనుగోలు ధరను గణనీయంగా తగ్గించగలిగామనీ, అంతేకాకుండా భవిష్యత్తులో 1.19 పైసల మేర యూనిట్ కొనుగోలు ధర తగ్గించటం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని రిజర్వాయర్లలోనూ 970 టీఎంసీలను నింపగలిగామనీ, రాయలసీమలోనూ పెద్ద ఎత్తున నీటిని నిలిపామని చంద్రబాబు చెప్పారు.రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. రీసర్వే ప్రక్రియను కూడా వేగంగా చేపడుతున్నామని తెలిపారు. గతంలో ఎన్టీఆర్ మునసబు, కరణాల వ్యవస్థను రద్దు చేసి రెవెన్యూ విభాగాన్ని ప్రక్షాళన చేశారని వివరించారు. ఈ 2026 ఏడాదిలో ల్యాండ్ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ విభాగంలోనూ పూర్తి పారదర్శకంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చంద్రబాబు వెల్లడించారు.వఅంతేకాకుండా వీబీ జీ రామ్ జీ ఉపాధి హామీ చట్టాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని కమ్యూనిటీ ఆస్తులు మరింతగా పెరిగే అవకాశం ఉంటుందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 25 ఏళ్ల క్రితమే పీపీపీ విధానంలో జాతీయ రహదారుల నిర్మాణం ప్రారంభమైందని గుర్తు చేశారు. ఇవాళ గిన్నిస్ రికార్డును సాధించే దిశగా రహదారుల నిర్మాణం జరుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. చేసిన పనులు సమర్థంగా ప్రజలకు చెప్పుకోవటం ముఖ్యమని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.కలియుగ వైకుంఠం తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వేంకటేశ్వరస్వామిపై ప్రజలకు అంత నమ్మకమని చంద్రబాబు పేర్కొన్నారు. ఇటీవల కాలంలో క్షేత్రాన్ని అపవిత్రం చేసే ప్రయత్నాలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరకామణిలో దొంగతనం జరిగితే సమర్థించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. కల్తీ నెయ్యితో ప్రసాదం తయారీ, ఖాళీ మద్యం బాటిళ్లను తిరుమలలో పెట్టడం లాంటి దుర్మార్గపు పనులకు పాల్పడ్డారని అరాచకవాదులను దుయ్యబట్టారు. దేవుడితో కూడా రాజకీయం చేస్తున్నారనీ, ఇది చాలా బాధాకరమని చంద్రబాబు తీవ్రంగా ఖండించారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు సీఎం సంక్రాంతి కానుక

**మొదటిపేజీ తరువాయి** – కార్యక్రమానికి వచ్చినట్లు చెప్పిన రేవంత్ రెడ్డి, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఈ కార్యక్రమానికి వచ్చినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగుల డీఏ 3.64 శాతం పెంచుతూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. 2024 జులై 1 నుంచి పెరిగిన డీఏ వర్తించనుండగా, జనవరి నెల వేతనంతో పెరిగిన డీఏ ఫిబ్రవరి 1న చెల్లించనున్నారు. 2023 జులై 1 నుంచి 2025 డిసెంబర్ 31 వరకు డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ చేశారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12 వేల కోట్ల మేర పెండింగ్ ఉన్నాయి. గత ప్రభుత్వం వదిలివెళ్లిన అప్పులు తీర్చేందుకు కృషి చేస్తున్నాం. ఉద్యోగుల్లో కూడా నేను నచ్చనివారు చాలా మంది ఉండవచ్చు. నేను వచ్చాక జీతాలు ఎలా వస్తున్నాయో మీరే గమనించాలి. ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఇక్కడికి వచ్చా. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం.రాష్ట్రంలో త్వరలో జిల్లాల పునర్విభజన ఉంటుందన్న సీఎం, ఇందుకోసం రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ప్రత్యేక కమిటీ వేస్తామని తెలిపారు. ఆ కమిటీ రాష్ట్రమంతా తిరిగి ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తుందన్నారు. గతంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు అడ్డగోలుగా జరిగిందన్న సీఎం, జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, అందుకు అనుగుణంగా జిల్లాల పునర్విభజన చేయనున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే కొత్త జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదని, అందుకే మార్చినట్లు సీఎం పేర్కొన్నారు. రాచకొండ పేరు రాచరిక పాలనకు గుర్తుగా ఉందని మార్చామన్నారు. సికింద్రాబాద్ విషయంలో తాను వచ్చాక చేసిందేమీ లేదని, సికింద్రాబాద్ గతంలోనే జీహెచ్ఎంసీలో భాగంగా ఉందని స్పష్టం చేశారు.గతంలో జిల్లాల విభజన సరిగా జరగలేదు. రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు అడ్డగోలుగా చేశారు. జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. త్వరలో జిల్లాల పునర్విభజన ఉంటుంది. ఇందుకోసం రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ప్రత్యేక కమిటీ వేస్తాం. ఆ కమిటీ రాష్ట్రమంతా తిరిగి ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తుంది. అందుకు అనుగుణంగా జిల్లాల పునర్విభజన చేస్తాం.

# పోలవరం ప్రాజెక్టులో మిగిలిన నీటిని తెలంగాణ వినియోగించుకోవచ్చు

**మొదటిపేజీ తరువాయి** – పోలవరంలో మిగిలిన నీటిని తెలంగాణ రాష్ట్రం కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులు నిర్మించినప్పుడు తాను ఎప్పుడూ అడ్డు చెప్పలేదని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ఆయన మంత్రులు, కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నల్లమలసాగర్ ద్వారా రాయలసీమ ప్రాంతంతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు నీరు అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం ఉండదని స్పష్టం చేశారు. ఎగువ నుంచి విడుదల చేసిన నీటిని పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు తరలించి వాడుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు. పోలవరంలో మిగిలిన నీటిని తెలంగాణ కూడా వినియోగిం చుకోవచ్చని అన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆశలను తాము నిలబెట్టామని, వారిలో విశ్వాసాన్ని



కల్పించామని ఆయన అన్నారు. 2025 సంవత్సరం మంచి ఫలితాలను ఇచ్చిందని చెప్పారు. విధ్వంసమైన వ్యవస్థల నుంచి సుపరిపాలనను గాడిలో పెట్టామని అన్నారు. సూపర్‌సిక్స్ ద్వారా సంక్షేమం, అభివృద్ధిని వేగవంతం చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం కూడా మరింత కష్టించి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అమలు చేసిన పథకాలు, వాటి ద్వారా లబ్ధి పొందిన వివరాలను ఆయన పేర్కొన్నారు.రాజధాని అమరావతిని గతంలో శ్మశానం, ఎడారి అని హేళన చేశారని, కానీ ఇప్పుడు అది ఒక స్ఫూర్తిదాయక ప్రాజెక్టు అని ఆయన అన్నారు. అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నామని అన్నారు. పోలవరం అద్భుతమైన ప్రాజెక్టు అని, అది పూర్తయితే దక్షిణ భారతదేశంలో ఏ రాష్ట్రం కూడా మనతో పోటీ పడలేదని అన్నారు.త్వరలో భోగాపురం విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటును కేంద్ర ప్రభుత్వం సహకారంతో కాపాడుకున్నట్లు చెప్పారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల సెంటిమెంట్ అని స్పష్టం చేశారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కే వచ్చాయని అన్నారు. పెట్టుబడులకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ మారిందని అన్నారు.

# వాహనాల చలాన్లకు డిస్కౌంట్ ఇవ్వొద్దు

**మొదటిపేజీ తరువాయి** – వాహనాలకు చలాన్లు విధిస్తున్నప్పటికీ, డిస్కౌంట్ ఇచ్చి తగ్గిస్తారనే భావన ఒక పెద్ద సమస్యగా మారిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇకపై ట్రాఫిక్ చలాన్లకు ఎలాంటి డిస్కౌంట్ ఇవ్వరాదని ఆయన సూచించారు. ఏ వాహనమైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే, యజమాని బ్యాంకు ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా డబ్బులు కట్ అయ్యే విధానం రావాలని ఆయన అభిప్రాయపడ్డారు.రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే లక్ష్యంతో యూసఫ్‌గూడ స్టేడియంలో ఏర్పాటు చేసిన 'అర్రైవ్ అలైవ్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుంటే, ప్రతి మూడు నిమిషాలకు ఒకరు మరణిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే వెంటనే బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యేలా, వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలోనే యజమాని బ్యాంకు ఖాతాను లింక్ చేయాలని స్పష్టం చేశారు. ఈ విషయంపై బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మైనర్లు ప్రమాదాలకు గురైతే వారి తల్లిదండ్రులపై కేసులు పెట్టాలని ఆయన ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల విషయంలో రవాణా శాఖ, పోలీసు శాఖ సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. చాలా సందర్భాల్లో మన ప్రమేయం లేకున్నా, ఎదుటివారి తప్పుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. హైడ్రా, ఈగల్, సైబర్ క్రైమ్ విభాగాలను బలోపేతం చేసినట్లే, ట్రాఫిక్ నియంత్రణలోనూ పోలీస్ వ్యవస్థను



సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

# మూడు రోజుల పాటు జరిగిన పీఠికాపుర సంక్రాంతి మహోత్సవం

**మొదటిపేజీ తరువాయి** – ఎస్. వరప్రసాద్, కర్నూలు నుంచి గురవయ్యల కళాకారుడు జె. మల్లికార్జున, లంబాడీ నృత్యంతో జి. సునీత, కృష్ణా జిల్లా డప్పు కళాకారుడు వి. రాజీవ్ బాబు, శ్రీకాకుళం తప్పెటగుళ్ల కళాకారుడు కె. మల్లేశ్వర రావు, విజయనగరం పులి వేషధారి కె. అప్పారావు, అల్లూరి సీతారామరాజు థింసా నృత్య కళాకారుడు పొద్దు అర్జున్, కోలాటం అంజలి, కోనసీమ గరగల కళాకారుడు రాజ్‌కుమార్, హరిదాసులు-గంగిరెద్దు కళాకారుడు సతీశ్... ఇలా ప్రతి కళాకారుడూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు.రెండవ రోజు ప్రార్థనా గీతాలతో శుభారంభం అయింది. విజయ శంకర్ నాయకత్వంలోని ప్రభుత్వ సంగీత-నృత్య పాఠశాల బృందం, కూచిపూడి రామాయణం వీ.ఎస్. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు భిన్నత్వంలో ఏకత్వం చాటారు. యోగా డ్యాన్స్‌తో శ్యామ్ బాబు బృందం ఆరోగ్యం-ఆధ్యాత్మికత సమన్వయాన్ని చూపించారు.మూడవ రోజు... వినాయక తత్వంతో మంజీర కూచిపూడి బృందం, నటరాజ నృత్యం పి. సత్యనారాయణ, రేలారే రేలా జానకిరావు ఆర్కెస్ట్రా... ఇలా ప్రతి రోజూ సాంస్కృతిక వైభవం ప్రదర్శనతో సంబరాలు జోరుగా సాగాయి.పట్టణ వీధుల్లో, గొల్లప్రోలు, యూ.కొత్తపల్లి మండలాల్లో తిరిగే కళారూపాలు, స్టాళ్లలో తోలుబొమ్మలు, మగ్గాలు, ఏటికొప్పాక లక్క బొమ్మలు, బొబ్బిలి వీణల తయారీ... ఇవన్నీ ప్రత్యేక ఆకర్షణలు. వీణలను స్టాల్ వద్దే తయారు చేసిన తీరు ఆకట్టుకుంది.పండగ సంబరాల కోసం వచ్చిన సినిమా నటులు హైపర్ ఆది, ఆర్.కె. సాగర్, నవీన్ పొలిశెట్టి, దర్శకుడు హరీశ్ శంకర్, జబర్దస్త్ నటులు నెల్లూరు నాగరాజు, శ్రీనివాసులు నాయుడు, అభిరాం తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు" అని పవన్ పేర్కొన్నారు.

# ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు

**మొదటిపేజీ తరువాయి** – తాను ఇప్పటివరకు ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని, సెలవు తీసుకోవాలని అనుకున్నప్పటికీ ఏదో ఒక పని వచ్చిపడుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ 2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరని, 10.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగులే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు.ఉద్యోగులే ప్రభుత్వ సారథులని, వారధులని పేర్కొన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. ఉద్యోగుల్లో కూడా తనను ఇష్టపడని వారు ఉండొచ్చని, తాను వచ్చిన తరువాత ఉద్యోగుల వేతనాలు ఎలా అందుతున్నాయో గమనించాలని అన్నారు. ఉద్యోగుల డీఏ ఫైళ్లపై సంతకం చేసి ఇక్కడికి వచ్చానని, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.1 కోటి బీమా ఇవ్వాలని నిర్ణయించామని ఆయన తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయని ఆయన అన్నారు. పన్ను వసూళ్లలో అవకతవకలు అరికడితే రావాల్సిన నిధులు వస్తాయని అన్నారు. పన్నులు పెంచాల్సిన అవసరం లేదని, సరిగా వసూలు చేస్తే చాలని వ్యాఖ్యానించారు. జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, త్వరలో జిల్లాల పునర్విభజన కోసం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

# పోలవరం-నల్లమల సాగర్ వివాదం



**మొదటిపేజీ తరువాయి** – ఉపయోగం ఉండదని న్యాయస్థానం సూచించింది. సూట్ దాఖలు చేస్తే గోదావరి నది పరీవాహక రాష్ట్రాల అభిప్రాయాలు పరిగణనలోకి వస్తాయని ధర్మాసనం పేర్కొంది. ఇంకా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల వాదనలు కూడా వినాల్సి ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.మా వాదనలు వినిపించాం : ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం నిర్మాణం చేయాలనుకుంటున్న ప్రాజెక్టుపై తమ అభ్యంతరాలతో రిట్ పిటిషన్ వేసినట్లు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దిల్లీలో మీడియాతో తెలిపారు. గత సోమవారం కూడా విచారణ జరిగిందని, తెలంగాణ ప్రభుత్వం తరఫున తమ వాదనలు వినిపించినట్లు చెప్పారు. గత సోమవారం ఇచ్చిన వాదనలకు అదనంగా ఇవాళ మరికొన్ని వాదనలు వినిపించామని అన్నారు. కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడొద్దనేది ఇందులో ముఖ్యమైన అంశమని ఆయన పేర్కొన్నారు.స్టాప్ వర్క్ ఆర్డర్‌ను అమలు చేయట్లేదు : నీళ్ల విషయంలో ఏపీ ప్రభుత్వం అనేక ఉల్లంఘనలు చేసిందని, వాటన్నింటినీ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. స్టాప్ వర్క్ ఆర్డర్‌ను అమలు చేయట్లేదని కూడా కోర్టుకు వివరించామన్నారు. ఏపీకి కేటాయించిన 484.5 టీఎంసీలు ఎక్కువగా ఉపయోగించుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఏపీ ప్రభుత్వం గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ముందుకెళ్తోందని ధర్మాసనానికి చెప్పామన్నారు.

# కొత్త కార్యాలయానికి ప్రధాని మోదీ



**మొదటిపేజీ తరువాయి** – భవనాలు ఉన్నాయి. 'సేవా తీర్థ్-1'ను పీఎంవో కోసం, 'సేవా తీర్థ్-2'ను కేబినెట్ సెక్రటేరియట్ కోసం, 'సేవా తీర్థ్-3'ను జాతీయ భద్రతా మండలి (చీజూ) కోసం కేటాయించారు. ఇప్పటికే కేబినెట్ సెక్రటేరియట్ గత ఏడాది సెప్టెంబర్‌లోనే కొత్త భవనంలోకి మారింది. ఇప్పుడు పీఎంవో కూడా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (జూఔణ) పర్యవేక్షణలో లార్సెన్ అండ్ టూబ్రో (ూ&ు) సంస్థ రూ.1,189 కోట్ల వ్యయంతో 24 నెలల్లో ఈ నిర్మాణం పూర్తి చేసింది. పాలనలో అధికారం ('సత్తా') కాకుండా సేవకే ('సేవ') ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పేందుకే ఈ భవనానికి 'సేవా తీర్థ్' అని పేరు పెట్టినట్లు గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు.ప్రధాని కార్యాలయం, కేబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి వంటి కీలక కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండటం వల్ల సమన్వయం మెరుగవుతుందని, భద్రత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. పీఎంవో పూర్తిగా ఖాళీ అయిన తర్వాత చారిత్రక నార్త్, సౌత్ బ్లాక్‌లను 'యుగ యుగీన్ భారత్ సంగ్రహాలయ' పేరుతో జాతీయ మ్యూజియంగా మార్చనున్నారు.

# ఇస్రో రాకెట్ ప్రయోగం విఫలం



**మొదటిపేజీ తరువాయి** – భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన రాకెట్ ప్రయోగం విఫలమైంది. తొలి రెండు దశల్లో సాఫీగా సాగిన రాకెట్.. మూడో దశలో గతి తప్పింది. ఉదయం 10.18 గంటలకు శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి పీఎస్ఎల్వీ సీ62 రాకెట్ నింగికెగిరింది. 18 నిమిషాల ప్రయాణం తర్వాత ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చాలి. అయితే, సాంకేతిక సమస్య వల్ల రాకెట్ తో సంబంధాలు తెగిపోయాయని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ వెల్లడించారు. సమస్యకు గల కారణాలను విశ్లేషిస్తున్నామని, త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.దేశ రక్షణ రంగానికి అత్యంత కీలకమైన 'ఈఓఎస్-ఎన్1' లేదా 'అన్వేష' ఉపగ్రహంతో పాటు భారత్, యూకే, థాయ్‌లాండ్, బ్రెజిల్, స్పెయిన్, నేపాల్ తదితర దేశాలకు చెందిన మరో 14 చిన్న ఉపగ్రహాలను కూడా ఈ రాకెట్ మోసుకెళ్లింది. అత్యంత కీలకమైన 'అన్వేష' ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టేందుకు చేపట్టిన రాకెట్ ప్రయోగం విఫలం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో నిరాశ వ్యక్తమవుతోంది. కాగా, 2025 మే 18న ప్రయోగించిన పీఎస్ఎల్వీ సీ61 రాకెట్ ప్రయోగం కూడా ఇదేవిధంగా మూడో దశలోనే విఫలమైంది. ఈ ప్రయోగంలో జరిగిన తప్పొప్పులను నిశితంగా పరిశీలించి, పొరపాట్లను సరిదిద్దుకున్నాక చేపట్టిన

# డిస్కంలకు షాక్ - రూ. 42 వేల కోట్లకు చేరిన కరెంట్ బిల్లులు

### రూ.42 వేల కోట్లకు చేరిన విద్యుత్తు బిల్లు బకాయిలు

### ఇవన్నీ రూ.50 వేలకుపైగా చెల్లించని వినియోగదారులవే

### గణనీయంగా పెరిగిన బిల్లు కట్టని వారి సంఖ్య




గత సెప్టెంబరు చివరినాటికి రాష్ట్రంలోని రెండు డిస్కంలకు కలిపి రూ.42,155.28 కోట్ల బిల్లులు ఎగవేసినట్లు తేలింది. వీటిలో హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఉత్తర డిస్కంకు రూ.17,968.45 కోట్లు వినియోగదారుల నుంచి రావాల్సి ఉంది. ఇది బిల్లు బకాయిలు రూ. 50 వేలకు పైగా చెల్లించని వారి నుంచి రావాల్సిన డబ్బుగా రెండు డిస్కంలు తేల్చాయి. దాదాపు ఆరు నెలల నుంచి ఇలా బిల్లు కట్టని వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉదాహరణకు దక్షిణ డిస్కం పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరం చివరినాటికి 32,346 కనెక్షన్ల నుంచి రూ.20,186.83 కోట్లకు ఎగబాకింది. జీహెచ్ఎంసీ పరిధిలో బిల్లులు కట్టని పరిశ్రమలు ఎక్కువగా ఉన్నట్లు డిస్కం వర్గాలు పేర్కొన్నాయి. ఈ డిస్కంకు రావాల్సిన మొత్తం రూ.24,186.63 కోట్లతో హైటెన్షన్ కనెక్షన్ల నుంచి రావాల్సినవే రూ.23,114.03 కోట్లుగా గుర్తించారు.కారణాలు ఇవేనా : కొన్ని పరిశ్రమలు మూతపడటంతో వాటికి సరఫరా నిలిపివేసినా బిల్లు మాత్రం చెల్లించ లేదు. నష్టాలతో మూతపడినందున బిల్లుల బకాయిలు కట్టలేమంటూ పలు పరిశ్రమల యాజమాన్యాలు కోర్టుకు వెళ్తున్నట్లు విద్యుత్ ఇంజినీర్లు తెలిపారు. పరిశ్రమలే కాకుండా ఇళ్లు, కొన్ని టౌన్‌షిప్, కమ్యూనిటీ కాలనీల నుంచి భారీగా బకాయిలు పేరుకుపోయాయి.వ్యక్తిగత ఇళ్ల కనెక్షన్ల వినియోగదారులు 2,496 మంది రూ.24.78 కోట్లు చెల్లించలేదు. 6 టౌన్‌షిప్‌లు, కమ్యూనిటీ కాలనీల నుంచి రూ.1.65 కోట్లు రావాల్సి ఉంది. వీధి దీపాలకు, ఎత్తిపోతల పథకాలకు సైతం బిల్లులు భారీగా రావాల్సి ఉంది. ఎక్కువగా కరీంనగర్ జిల్లాలో రూ.5,334 కోట్లు, పెద్దపల్లిలో రూ.4,123 కోట్లు, జయశంకర్ రూ.2,682 కోట్లు, నిజామాబాద్‌లో రూ.1,468 కోట్లు, హనుమకొండలో రూ.1,155కోట్లు చెల్లించలేదని తేలింది.ఆర్ఆర్ చట్టం అమలేదీ : రెవెన్యూ రికవరీ చట్టం కింద బిల్లుల బకాయిదారులకు మండల తహసీల్దార్ ద్వారా నోటీసులిచ్చి ఆస్తులను జప్తు చేయించే అధికారం డిస్కంలకు ఉంది. నోటీసులివ్వగానే రాజకీయ నేతల ద్వారా ఒత్తిడి తెచ్చి ఎలాంటి చర్యలు తీసుకోకుండా అడ్డుకుంటున్నారని సీనియర్ ఇంజినీరు తెలిపారు. భారీగా బిల్లులు ఎగవేసిన హెచ్‌టీ కనెక్షన్ల వారు నాయకుల బంధువులో, అనుచరులో కావడంతో వారికి కరెంటు సరఫరా నిలిపివేయడం మినహా, ఆర్ఆర్ చట్టం కింద నోటీసులిచ్చి ఆస్తులు జప్తు చేయడానికి వీలవడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ రూ.42 వేల కోట్లు వసూలైతే డిస్కంలకు ఆర్థిక ఇబ్బందులే ఉండవని వివరించారు.కొత్త డిస్కం పరిధిలో విద్యుత్ పథకాలు : ఆరు నెలల క్రితం విద్యుత్ పంపిణీ వ్యవస్థలపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఉండగా, మరో డిస్కం ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. విద్యుత్ శాఖ ప్రక్షాళన కోసం సంస్కరణలు అమలు చేయాలని స్పష్టం చేశారు. ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌ను వాణిజ్య విద్యుత్ కార్యకలాపాలకు పరిమితం చేసి, కొత్త డిస్కం ద్వారా ప్రభుత్వం రాయితీ ఇచ్చే కరెంట్‌ను సరఫరా చేయాలని సూచించారు.రుణ భారం తగ్గాలని ఇలా : వ్యవసాయానికి, ప్రభుత్వ విద్యా సంస్థలకు, 200 యూనిట్ల వరకు గృహాలకు ఇచ్చే ఉచిత విద్యుత్ పథకాలన్నీ ఈ కొత్త డిస్కం పరిధిలోకి తీసుకురావాలని సీఎం తెలిపారు. కొత్త డిస్కం ఏర్పాటుతో ఇప్పుడున్న విద్యుత్ పంపిణీ సంస్థల పని తీరు మెరుగుపడి, జాతీయ స్థాయిలో రేటింగ్ పెరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. డిస్కంల పునర్ వ్యవస్థీకరణతో పాటు విద్యుత్ సంస్థలపై ఇప్పుడున్న రుణ భారం తగ్గించాలని సూచించారు. వడ్డీ 6 శాతం లేదా అంతకన్నా తక్కువ ఉండేలా రుణాలను రీస్ట్రక్చర్ చేసుకునేలా వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు.

# ఈ రైళ్లలో కాలు పెట్టే పరిస్థితి కూడా లేదు

### జనరల్‌లో వెళ్లాలనుకుంటే జాగ్రత్త

### సాధారణ బోగీల్లో రెట్టింపు సంఖ్యలో ప్రయాణికులు

### దేవగిరి ఎక్స్‌ప్రెస్, దానాపూర్, గోదావరి, పద్మావతి, నారాయణాద్రి, విశాఖ ఎక్స్‌ప్రెస్, తెలంగాణ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లన్నింటిలోనూ కాలు పెట్టలేనంతగా రద్దీ



రైళ్ల రద్దు, ఉన్న సాధారణ బోగీలకు రెట్టింపు ప్రయాణిస్తుండటంతో రైలు ప్రయాణం నరకప్రాయమవుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా సాధారణ బోగీల సంఖ్య పెంచకపోవడంతో వందలాది మంది కిక్కిరిసి ప్రయాణించాల్సి వస్తోంది. దేవగిరి ఎక్స్‌ప్రెస్, దానాపూర్, గోదావరి, పద్మావతి, నారాయణాద్రి, విశాఖ ఎక్స్‌ప్రెస్, తెలంగాణ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లన్నింటిలోనూ కాలు పెట్టలేనంతగా రద్దీ ఉంటోంది. ప్రయాణికులు చాలా ప్రమాదకరమైన రీతిలో నిలబడి గమ్యస్థానానికి చేరుకుంటున్నారు.రెట్టింపు సంఖ్యలో ప్రయాణికులు : సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్ల నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తున్న 250 రైళ్లలో సుమారు 100 వరకు ప్యాసింజర్, 150ఎక్స్‌ప్రెస్ రైళ్లున్నాయి. ఇందులో సుమారు 2లక్షల మంది సాధారణ ప్రయాణికులే ఉండటం గమనార్హం. ప్రస్తుతం 24 లేదా 18 బోగీలున్న రైళ్లలో 3 నుంచి 4 సాధారణ బోగీలుండగా ప్రయాణికులు రెట్టింపు సంఖ్యలో ఉంటున్నారు. 10 శాతం రైళ్లలో మాత్రమే సాధారణ బోగీలు పెంచడంతో రద్దీకి సరిపోవడం లేదు. సంక్రాంతికి ఊళ్లకు వెళ్తున్న ప్రయాణికులు అధికంగా ఉండడమే ఇందుకు కారణం.రద్దుతో పెరుగుతున్న రద్దీ : ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చేయడం, జనరల్ బోగీలను దశలవారీగా ఒకటి, రెండుకి తగ్గించేయడం సాధారణ ప్రయాణికులు, శ్రామికులు తీవ్ర అవస్థలు పడేలా చేస్తోంది. విజయవాడ, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు, భువనేశ్వర్, ముంబయి ఇలా వివిధ ప్రాంతాలకు కొన్ని వందల రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏ రైలు చూసినా ఒకటి లేదా రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉంటున్నాయి. నగరం నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే పుష్‌పుల్, ప్యాసింజర్ రైళ్లను తరచూ రద్దు చేయడంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లపై ఒత్తిడి పెరుగుతోంది. నిర్వహణ పనుల పేరుతో వారం పాటు రద్దు చేస్తుండటంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది.మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్ ఇతర స్టేషన్ల నుంచి 1500 మందికిపైగా ప్రయాణికులు నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. కానీ మహబూబ్‌నగర్ నుంచి కాచిగూడకు వచ్చే రైళ్లు తరచూ రద్దవుతున్నాయి.

**సికింద్రాబాద్ నుంచి ముంబయి వెళ్లే దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో నాలుగు సాధారణ బోగీలు సికింద్రాబాద్‌లోనే కిక్కిరిసిపోతున్నాయి.**

మరిన్ని రైళ్లు కావాలి : మరోవైపు సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హైదరాబాద్-విజయవాడ మధ్య పది ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఛైర్ కార్, జనరల్ బోగీలతో నడిచే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. పండగకు ముందు, తరువాత రోజుల్లో ఈ ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగించనున్నట్లు ప్రకటించింది. పండుగ సందర్భంగా మరిన్ని రైళ్లు నడపాలని దూరప్రాంత వాసులు కోరుతున్నారు. ఈ నెల 11, 12, 13, 18, 19 తేదీల్లో ఉదయం 6.10 గంటలకు హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రత్యేక రైళ్లు నడవవున్నాయి.ఈ నెల 10, 11, 12, 17, 19 తేదీల్లో మధ్యాహ్నం 2.40 గంటలకు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక రైళ్లు నడవవున్నాయి.రిజర్వేషన్ చేసుకోని వారి కోసం రైళ్లలో సగానికి పైగా జనరల్ బోగీలు ఏర్పాటు చేశారని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.టైమ్ టేబుల్ ఉన్నా తప్పని ఇబ్బందులు : రైల్వే శాఖ ఈ ఏడాది ప్రారంభంలోనే ప్రయాణికుల సౌకర్యార్థం, రైల్వే నెట్‌వర్క్ ఆధునీకరణలో భాగంగా పలు రైళ్ల రాకపోకల్లో మార్పులు చేసి కొత్త టైమ్ టేబుల్‌ను రూపొందించినట్లు తెలిపింది. అయినా ప్రయాణికులు ఆఖరి క్షణం వరకు వెయిటింగ్ లిస్ట్‌లో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రయాణికులు పండుగ వేళ ఇంట్లో ఉండాలనే కోరికతో అత్యంత రద్దీగా ఉన్న రైలులో కూడా ప్రయాణం చేసేందుకు సిద్దంగా ఉన్నారు. కానీ, అటువంటి ప్రయాణాలలో తగిన జాగ్రత్తలు పాటించడం అవసరం.

# చైల్డ్ పోర్నోగ్రఫీ చూస్తే ఊచలు లెక్కబెడతారు

### తప్పించుకునే ఛాన్సే లేదు

### గతేడాది నుంచి ఇప్పటి వరకు 30 మందిపై కేసులు నమోదు

### చిన్నారుల అశ్లీల వీడియోలు చూసినా, క్రియేట్ చేసినా, వేరొకరికి పంపినా శిక్షార్హులే

### హెచ్చరిస్తున్న పోలీసులు



కొందరు యువకులు చిన్నారుల అశ్లీల దృశ్యాలు వీక్షిస్తూ నేరాల ఉచ్చులో చిక్కుకుంటున్నారు. మనల్ని ఎవరు గమనిస్తారులే అనుకుని పోర్న్‌సైట్లను చూస్తూ హద్దులు దాటుతున్నారు. చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలు డౌన్‌లోడ్ చేస్తున్నారు. ఇది చట్టరీత్యా నేరం. చివరకు పోలీసు నిఘాలో పట్టుబడి కటకటాల పాలవుతున్నారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు పోలీస్ కమిషనరేట్ పరిధిలో 30 మందిపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఇరుక్కుంటే విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చేజారడమే కాదు, విదేశాలకు వెళ్లే అవకాశాన్నీ కోల్పోతారు. తస్మాత్ జాగ్రత్త.15 మంది అరెస్ట్ : పిల్లల అశ్లీల చిత్రాలు ఉన్న వీడియోలను ప్రసారం చేస్తున్నందుకు 15 మందిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అరెస్టు చేసింది. టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ, నిందితులందరూ తరచుగా పిల్లల అశ్లీల చిత్రాలను ఆన్‌లైన్‌లో ప్రసారం చేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు.నగరంలో ఓ యువకుడికి ఫోన్‌లో చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలు చూసే అలవాటు ఉంది. ఐపీ అడ్రస్ ఆధారంగా అతడి వివరాలు గుర్తించిన పోలీసులు ఇటీవల కేసు నమోదు చేశారు. ఏడాది క్రితం చేసిన పొరపాటుకు ఇప్పుడు కేసులో ఇరుక్కున్నాడు.స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్, ల్యాప్‌టాప్‌లు వాడేవారు బాలల, నిషేధిత సైట్లల్లో అశ్లీల చిత్రాలు వీక్షిస్తున్నారు. పోలీస్ శాఖ గుర్తించడం అసాధ్యం అనే భ్రమలో ఉంటున్నారు. ఇలా అనుకోవడం పొరపాటే. సాంకేతికత సాయంతో నిందితులు ఎక్కడ ఉన్నా పట్టేస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.సాంకేతికత సాయంతో వెంటనే : చిన్నపిల్లల అక్రమ రవాణా, వారిపై జరిగే అఘాయిత్యాల చిత్రీకరణ, పోర్నోగ్రఫీ సంబంధిత నేరాలను గుర్తించి తక్షణం స్పందించేందుకు 'నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లోయ్‌టెడ్ చిల్డ్రన్స్ పోర్టల్' సమర్థంగా పనిచేస్తోంది. సామాజిక మాధ్యమాల్లో బాలల అశ్లీల వీడియోలు క్రియేట్ చేసినా, వేరొకరికి పంపినా (చైల్డ్ అబ్యూస్ మెటీరియల్) ఆ విభాగం గుర్తిస్తుంది. సాంకేతికతతో ఐపీ అడ్రస్, ఈ-మెయిల్, ఫోన్ నంబర్లను గుర్తించి సంబంధిత నిజామాబాద్ జిల్లాల సైబర్‌క్రైం పోలీసులకు పంపుతారు. వారు వెంటనే విచారణ చేపడతారు.కౌన్సెలింగ్‌లో వినకుంటే రిమాండ్‌కి : 'అంతర్జాలంలో సేకరించినా, మిత్రులకు పంపినా, పిల్లల అశ్లీల వీడియోల వీక్షణ, స్టోరేజీ నేరం కిందకు వస్తుంది. పోలీసు శాఖ ఇది గుర్తించి కేసులు నమోదు చేస్తుంది. దొరికాక తెలియక జరిగిందని కాళ్లా వేళ్లాపడుతున్నారు కొందరు. విద్యార్థులు, ఉద్యోగులు, విదేశాలకు వెళ్లేందుకు సిద్ధమైన యువత జీవితంలో తీవ్రంగా కోల్పోతున్నారు. దర్యాప్తులో తేలిన అంశాల ఆధారంగా కొందరికి కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేస్తున్నాం. తీవ్రత ఉంటే కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నాం.' అని సైబర్ క్రైం ఏసీపీ వెంకటేశ్వర్‌రావు 'ఈ టీవీ భారత్'కు చెప్పారు.అలవాటుగా మారే ప్రమాదం : ప్రస్తుత సాంకేతిక యుగంలో పిల్లలకు ఫోన్, టీవీ, పీసీ, ట్యాబ్లెట్ ఇలా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ ఓ వ్యసనంగా మారిపోయాయి. వీడియో గేమ్స్ వంటి వాటికి పిల్లలు బానిసలుగా మారిపోతున్నారు. టీనేజర్స్ అయితే సోషల్ మీడియాలోనే ఎక్కువ కాలం గడిపేస్తుంటారు. అందులో కనిపించే అశ్లీల దృశ్యాలకు ఆకర్శితులై, స్నేహితులతో చర్చించుకుని, వాటిని పదేపదే చూసేలా అలవాటు పడిపోతుంటారు. ఈ నియమాలు పాటించండి : అలా పిల్లలు అలవాటు పడకుండా వాళ్లు ఫోన్ చూసే విషయంలో ఓ నియమం పెట్టండి. కేవలం హాల్‌లో మాత్రమే ఫోన్ వాడే విధంగా కండీషన్ పెట్టండి. బెడ్‌రూమ్‌లో ఫోన్ వాడొద్దని చెప్పండి. ముఖ్యంగా పెద్దలు కూడా బెడ్‌రూమ్‌లో ఫోన్ వాడకుండా చూసుకోండి. పెద్దల్ని చూసే పిల్లలు నేర్చుకునేది, అందుకే మీరు కూడా పడుకునే టైంలో ఫోన్ వాడటాన్ని బంద్ చేయాలి.అవగాహణ కల్పించాలి : చాలా మంది పిల్లలకు ఇంటర్నెట్‌ను ఎలా వాడాలో తెలుసుగానీ.. వాటి వల్ల కలిగే ప్రమాదాల గురించి తెలియదు. ఈ విషయంలో తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి. ఇంటర్నెట్ భద్రత గురించి వాళ్లకు వివరంగా చెప్పాలి. ఆన్‌లైన్ వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రమాదాల గురించి ఎటువంటి దాపరికాలు లేకుండా ఓపెన్‌గా కమ్యూనికేట్ అవ్వండి.

# హైదరాబాద్‌లో దారుణం

### పబ్‌లో పరిచయమైన అమ్మాయి

### తనతో మాట్లాడట్లేదని హత్య




హైదరాబాద్ బోరబండలో యువతి దారుణ హత్యకు గురైంది.పబ్‌లో పరిచయమైన అమ్మాయి తనతో మాట్లాడటం మానేసిందనే కోపంతో హత్య చేసి గోడ పక్కనే పడేశాడు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసుల కథనం ప్రకారం.. జహీర్ జ్యూస్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. పబ్‌లో పనిచేసే సమయంలో అతనికి ఖనీజ్ ఫాతిమా పరిచయం అయ్యింది. ఇద్దరూ కొంతకాలం స్నేహంగానే ఉన్నారు. అయితే ఇటీవల ఫాతిమా వేరే పబ్‌లో ఉద్యోగంలో చేరింది. అప్పటి నుంచి జహీర్‌తో మాట్లాడటం తగ్గించింది. దీంతో ఫాతిమాపై అనుమానం పెంచుకున్న అతను.. ఆమెను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో మాట్లాడుకుందామని చెప్పి ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రి వెనుక ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడే ఆమెను చంపేసి, పక్కనే ఉన్న బస్తీకి వెళ్లాడు. బస్తీవాసులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.ఈ హత్యపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. హత్యకు గల అసలు కారణాలేంటి? నిజంగానే మాట్లాడటం లేదని హత్య చేశాడా? ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

### పద్మారావునగర్ లో స్వామి వివేకానంద జయంతి వేడుకలు



**సికింద్రాబాద్, జనవరి 12 ( ప్రజామంటలు) :** స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ బన్సీలాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు మహేష్ రామంచ, నగర నాయకుడు టీ.వీ.ఎన్. రాజేష్ ఆధ్వర్యంలో పద్మారావు నగర్‌లోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానికులకు ఎనర్జీ కూల్ డ్రింక్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంట్ కన్వీనర్ టి. రాజశేఖర్ రెడ్డి, కే.ఎం. కృష్ణ, వై. సురేష్, ఎలకొండ శ్రీనివాస్ ముదిరాజ్, శీలం శివలింగం, కే. కృష్ణ, మంత్రి కళావతి, అంగముత్తు శ్రీనివాస్, మహిళా నాయకురాలు కే. అండాలు తదితరులు పాల్గొన్నారు.వక్తలు మాట్లాడుతూ స్వామి వివేకానంద వంటి మహానుభావుల ఆలోచనలు స్మరించుకోవడం అవసరమని, వారి ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా స్వామి వివేకానంద 163వ జయంతి




**ఇబ్రహీంపట్నం జనవరి 12(ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలోని బస్టాండ్ వద్ద గల స్వామి వివేకానంద విగ్రహానికి హిందూ సేన ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఫోనుకంటి చిన్న వెంకట్ స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్బంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉక్కు నరాలు ఇనుప కండరాలు యువకులు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని మరియు యువకులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని ఆయన మాట్లాడారు, యువత సోషల్ మీడియా కు దూరంగా వుండి కేవలం భవిష్యత్ నిర్మాణానికి ఉపయోగపడేవిధంగా మార్చుకోవాలని స్వామి వివేకానంద మార్గంలో నడవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫోనుకంటి చిన్న వెంకట్. ఉపసర్పంచ్ తుమ్మల జయ నరసయ్య, మరియు బిజెపి మండల అధ్యక్షుడు బాయ్ లింగారెడ్డి, సంఘ పరివార్ కార్యకర్త మట్టల రామ్ కుమార్, రాజ్ కుమార్ మరియు మాజీ సర్పంచ్ దొంతుల శ్యామల తూక్కారం, గ్రామ వీడిసి అధ్యక్షుడు బాయ్ లింగారెడ్డి, దగ్గుల అశోక్, పారిపెల్లి గణేష్, అడ్వకేట్ కాంతి మోహన్ రెడ్డి మరియు హిందూ సేన సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అధ్యక్షునిగా వోడ్నాల రాజశేఖర్ ఏకగ్రీవ ఎన్నిక



**జగిత్యాల జనవరి 12 (ప్రజా మంటలు) :** జిల్లా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో జగిత్యాల జిల్లా ఉపాధ్యాయుడు వోడ్నాల రాజశేఖర్ రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా వోడ్నాల రాజశేఖర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగానికి సంబంధించిన వివిధ అంశాలపై అంకితభావంతో పనిచేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు శాఖను ముందుండి నడిపిస్తానని ఆయన అన్నారు.ఈ ఎన్నిక సందర్భంగా శాఖా జిల్లా అధ్యక్షులు బోయినపల్లి ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేష్, రాష్ట్ర బాధ్యులు ఆయిల్నేని నరేందర్ రావు, గడ్డం మైపాల్ రెడ్డి గారు వోడ్నాల రాజశేఖర్‌కు అభినందనలు తెలియజేశారు. మండల స్థాయి కార్యకర్తగా ప్రారంభమై, మండల అధ్యక్షుడిగా, జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వంటి వివిధ హోదాల్లో బాధ్యతాయుతంగా పనిచేసి ఈ రోజు రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.సంఘ భావజాలాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేలా కృషి చేయాలని, ఉపాధ్యాయులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ముందుండాలని కోరుతూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## మాజీ మంత్రి తలసాని 24 గంటల్లో క్షమాపణ చెప్పాలి

### లేని పక్షంలో కేసులు, గల్లీగల్లీలో ఆందోళనలు

### పిసిసి వైస్ ప్రెసిడెంట్ డా. కోట నీలిమ



**సికింద్రాబాద్, జనవరి 12 (ప్రజా మంటలు ) :** సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను పీసీసీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కోట నీలిమ తీవ్రంగా ఖండించారు. తలసాని అహంకారపూరిత వ్యాఖ్యలు మానుకోవాలని హెచ్చరించారు.తలసాని వ్యాఖ్యలకు నిరసనగా బేగంపేట్ పోలీస్ స్టేషన్ ఎదుట కాంగ్రెస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. డా. కోట నీలిమ మాట్లాడుతూ, 24 గంటల్లో సీఎం రేవంత్ రెడ్డికి, తెలంగాణ ప్రజలకు తలసాని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకపోతే కేసులు నమోదు చేయడంతో పాటు సనత్‌నగర్ గల్లీగల్లీలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.హైదరాబాద్ అభివృద్ధి, పరిపాలనా సౌలభ్యం కోసమే జీహెచ్ఎంసీ విభజన జరిగిందని, హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆమె తెలిపారు.

## స్కై ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు



**సికింద్రాబాద్, జనవరి 12 (ప్రజా మంటలు) :** స్వామి వివేకానంద జయంతిని స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. వ్యక్తిత్వ వికాసం ద్వారా యువతను మహోన్నత స్థాయికి చేర్చిన మహనీయుడు స్వామి వివేకానంద అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆయన బోధనలు నేటికీ యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు.యువత మంచి ఆలోచనలతో ముందుకు సాగితే దేశ భవిష్యత్తు ప్రపంచానికి గర్వకారణంగా నిలుస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ ఫౌండర్ & ప్రెసిడెంట్ డాక్టర్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని తదితరులు పాల్గొన్నారు.

## సీతాఫల్మండిలో సంక్రాంతి ముగ్గుల సంబరాలు



**సికింద్రాబాద్, జనవరి 12 ( ప్రజామంటలు) :** భారతీయ జనతా పార్టీ సీతాఫల్మండి డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. బీజేపీ మాజీ ఉపాధ్యక్షులు రాచమల్ల కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు కనికట్ల హరి, మాజీ అధ్యక్షులు అంబాల రాజేశ్వరరావు మాట్లాడుతూడ ప్రజలు ముగ్గులు, పిండి వంటకాలు, పతంగులతో పండుగను ఆనందంగా జరుపుకుంటున్నారని తెలిపారు.ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మేకల కీర్తి హర్షకిరణ్, అజయ్ నాయుడు, ఇవి నరేష్ తదితరులు పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com